క్లుప్తంగా

గంగపుత్రులకు ఆత్మగౌరవ భవన నిర్మాణానికి చర్యలు



ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: గంగపుత్రుల ఆత్మగౌరవ భవన నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే 15 రోజుల్లో భవన నిర్మాణ పనులు ప్రారంభించడంతో పాటు ట్రస్టీ కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. గంగపుత్ర అభివృద్ధి సంస్థ రాష్ట్ర నాయకులు గాలి సత్యనారాయణ, ఆర్.సురేష్, ఆనంద్, శంకర్, యాదగిరి, బాలచందర్, మెట్టు ధనరాజ్, ఎల్లయ్య, సుధాకర్ తదితరులున్నారు.

తెలంగాణ ఉద్యమకారుడికి ఆర్థికసాయం

ముషీరాబాద్: తెలంగాణ ఉద్యమకారుడు దివంగత హోంమంత్రి నాయిని నర్సింహ్మారెడ్డి అనుచరుడు సర్దార్ గురుచరణ్‌సింగ్‌కు నాయిని నర్సింహ్మారెడ్డి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాస్‌రెడ్డి ఆర్థికసాయాన్ని శుక్రవారం అందజేశారు. ఆయన గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ.. ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని విషయం తెలిసి సాయం చేశామన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు నేత శ్రీనివాస్, సిరిగిరి శ్యామ్, కార్తీక్‌యాదవ్, ప్రభాకర్‌చారి, అజ్జు, సాయి తదితరులున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



ఉచిత వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

కాచిగూడ: మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డు ఆధ్వర్యంలో శ్రీకర ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శుక్రవారం కాచిగూడలోని మున్నూరు కాపు భవన్, మ్యాడం అంజయ్య హాల్‌లో నిర్వహించిన ఈ వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. డాక్టర్ కార్తీక్, దయాకర్, సుష్మ, కొండా శ్రీనివాస్‌రావు, రాంచందర్, రాపర్తి తారా తదితరులు పాల్గొని రోగులకు వైద్యసేవలు అందించారు. అవసరమైన వారికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఆకుల పాండురంగం, మంద సూర్యప్రకాష్, ప్రశాంత్, హజారి రాంమోహన్ తదితరులున్నారు.

అక్కినేని జీవితం ఆదర్శప్రాయం

చిక్కడపల్లి: సినీ కళాకారులకే కాకుండా యువతకు అక్కినేని జీవితం ఆదర్శప్రాయమని ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. శుక్రవారం రాత్రి త్యాగరాయగానసభలో ప్రధాన వేదికపై జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ అక్కినేని నాగేశ్వర్‌రావు శతజయంతి సందర్భంగా వివిధ రంగాల ప్రముఖులకు నగదు పురస్కార ప్రధాన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. చిల్ల రాజశేఖరరెడ్డి అధ్యక్షత వహించిన సభలో లంక లక్ష్మీనారాయణ, రామరాజు శ్రీనివాస్‌రావు, గిడుగు కాంతి కృష్ణ తదితరులున్నారు.

యువకుడిపై దాడి.. నిందితుల రిమాండ్

కాచిగూడ: తాగుడుకు బానిసై రైల్వేస్టేషన్లను ఎంచుకొని దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను కాచిగూడ రైల్వే పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా అహ్మద్‌నగర్ ప్రాంతానికి చెందిన అజీజ్ కుమారుడు అబ్దుల్ రషీద్ (42), అదే ప్రాంతానికి చెందిన చాంద్ పాషా కుమారుడు ఎంపీ జావీద్ (24), ఓల్డ్ మలక్‌పేట ప్రాంతానికి చెందిన నర్సింగ్ కుమారుడు ప్రభు (23) ఈ ముగ్గురు నేరస్తులు జులాయిగా సంచరిస్తూ.. పలు రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల బ్యాగులోంచి డబ్బులు, సెల్‌ఫోన్లను దొంగిలిస్తుంటారు. బుధవారం రాత్రి ఉందానగర్ రైల్వే స్టేషన్ సమీపంలో మర్క్యాపురం ప్రాంతానికి చెందిన ఎం.కేశవ్ టాయిలెట్‌కి వెళ్లగా.. మాటువేసిన ముగ్గురు కేశవ్‌పై దాడికి పాల్పడి ఖరీదైన సెల్‌ఫోన్, రూ.500 తీసుకొని పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సీసీ పుటేజీల ఆధారంగా ముగ్గురు దుండగులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. శుక్రవారం వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు సమాచారం.

రూ.75 లక్షలతో అభివృద్ధి పనులు



సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట: కోట్లాది రూపాయలతో నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల పరిధిలో నూతనంగా సీసీరోడ్లు నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. గత నాలుగేళ్లుగా కోట్లాది రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. శుక్రవారం నల్లకుంట రైల్వేట్రాక్ పక్కన ఉన్న స్ట్రీట్ నంబర్ 8లో రూ.75 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేయనున్న సీసీరోడ్డు పనులకు స్థానిక కార్పొరేటర్ అమృతతో కలిసి ఎమ్మెల్యే కాలేరు శంకుస్థాపన చేసి మాట్లాడారు. నియోజకవర్గంలోని అన్ని బస్తీలు, కాలనీల్లో సమాన ప్రాతిపదికన మౌళిక సదుపాయాలకల్పనకు పెద్దపీట వేస్తూ.. దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. నియోజకవర్గంలో పార్కుల సుందరీకరణతో పాటు సీసీరోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాల ఏర్పాటు తదితర మౌలిక వసతులను సమకూరుస్తున్నామన్నారు. జీహెచ్ఎంసీ డీఈ ప్రవీణ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరేందర్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్, సీనియర్ నాయకులు ఎం.భూపతినాథ్, భాస్కర్‌గౌడ్, గాలపల్లి శంకర్, ఇర్ఫానా సుల్తానా, కూర నరేందర్, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు రమణానాయుడు, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్, నగర నాయకులు ఎంబీ. కిశోర్‌కుమార్ తదితరులున్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



కుద్బిగూడలో పైపులైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్

కాచిగూడ: వరదనీటితో పైపులైన్ పగిలి నీరు ఇళ్లలోని చేరుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో శుక్రవారం కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ అధికారులు, సిబ్బందితో కలిసి కుద్బిగూడ ప్రాంతంలో పర్యటించి వర్షపునీటి పైపులైన్లకు మరమ్మతులు చేయించారు. జలమండలి డీజీఎం సన్యాసిరావు, ఏఈ భావన, జీహెచ్ఎంసీ ఏఈ విశ్వతేజ, బీజేపీ నేతలు సుభాష్ పటేల్, శంకర్, భీమ్‌రాజ్, బాలప్రసాద్, ప్రతిభ, వాసు, రవియాదవ్, ఆర్.సంతోష్, తదితరులున్నారు.

జర్నలిస్టుల రైల్వే రాయితీ పాస్‌లను పునరుద్ధరించండి



కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఎం.సోమయ్య

కాచిగూడ: దేశ వ్యాప్తంగా నిలిపివేసిన జర్నలిస్టుల రైల్వే రాయితీ పాస్‌లను పునరుద్ధరించాలని ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ప్రతినిధులు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, జాతీయ కార్యదర్శి ఆనందం తదితరులు శుక్రవారం కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. జర్నలిస్టులకు అమలవుతున్న రాయితీ పథకాన్ని మూడేళ్ల క్రితం కరోనా సమయంలో నిలిపివేశారని, దీనివల్ల దేశవ్యాప్తంగా జర్నలిస్టులు వృత్తిపరమైన విధి నిర్వహణలో రైలు ప్రయాణంలో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయమై గతంలో పలు మార్లు రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని, ఇప్పటికైనా రైల్వే పాస్‌లను పునరుద్ధరించాలని వారు కోరారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న బేగంపేట టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు

నల్లకుంట: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని బేగంపేట ట్రాఫిక్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. బేగంపేట టీటీఐ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యానగర్‌లో స్వామి వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు పీపీటీ ద్వారా రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండిన తర్వాత డ్రైవింగ్ లైసెన్స్ పొందేందుకు అర్హులని, ఆ తర్వాతనే వాహనాలు నడపాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సుకన్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జేసీబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర విధానాలతోనే చేనేత పరిశ్రమకు దెబ్బ



మాట్లాడుతున్న సీఐటీయూ జాతీయ అధ్యక్షురాలు కె.హేమలత

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కేంద్ర ప్రభుత్వ విధానాల వల్లే చేనేత పరిశ్రమ దెబ్బతిన్నదని సీఐటీయూ జాతీయ అధ్యక్షురాలు కె.హేమలత అన్నారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేనేత కార్మికుల జాతీయ కన్వెన్షన్ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. కార్పొరేట్ శక్తులకు పెట్టుబడులు అప్పజెప్పి కార్మికుల పొట్టకొడుతుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. చేనేత పరిశ్రమ అభివృద్ధికి కార్మికులకు వడ్డీలేని రుణాలు ఇవ్వాలని కోరారు. సభకు ముందు సీఐటీయూ జాతీయపతాకాన్ని ఆమె ఆవిష్కరించారు. సీఐటీయూ జాతీయ కోశాధికారి సాయిబాబు, జాతీయ కార్యదర్శి కరిమాలయన్, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, తెలంగాణ ప్రధాన కార్యదర్శి పాలడుగుభాస్కర్, ఎస్.రమ, కూరపాటి రమేష్, శ్రీకాంత్ వివిధ రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

'ఘర్షణ' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నందినిసిధారెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రముఖ రచయిత డాక్టర్ కొండపల్లి నిహారిని రచించిన కథల సంపుటిని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రచయితల సంఘం, పాల పిట్ట బుక్స్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షులు నందినిసిధారెడ్డి హాజరై మాట్లాడుతూ.. మానవ సంబంధాల ఔనత్యాన్ని తన పుస్తకంలో గొప్పగా రచించారన్నారు. ప్రధానంగా స్త్రీల సమస్యలపై వర్తమాన సమాజంలో స్త్రీలు ఎదుర్కొంటున్న వివక్షతను స్పష్టంగా తన కవిత్వంలో రచించారన్నారు. అమెరికాలో స్థిరపడ్డ తెలుగువారి జీవితం గురించి ప్రపంచీకరణలో అంతరించిపోతున్న కుల వృత్తుల గురించి గొప్పగా రాశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల అధ్యక్షుడు కందుకూరి శ్రీరాములు, రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షుడు మంత్రి శ్రీదేవి, ప్రముఖ ఇంజినీర్ ముత్యుంజయుడు, ప్రముఖ రచయితలు శీల సుభద్రదేవి, రమాదేవి, వాణి దేవులపల్లి, సంపత్ తదితరులున్నారు.

ఆర్ట్స్ కాలేజీ ఎదుట బర్త్‌డే కేక్ కటింగ్‌లు నిషేధం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఆర్ట్స్ కాలేజీ ఎదుట, ఆవరణలోబర్త్‌డే కేక్ కటింగ్‌లను నిషేధిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం ఆర్ట్స్ కాలేజీ ఆవర్ణలో రిజిస్ట్రార్ పేరు మీద బర్త్‌డే కేక్ కటింగులను నిషేధిస్తూ తీసుకున్న ఇనర్ణయంపై బ్యానర్లను ఏర్పాటు చేశారు. కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఆర్ట్స్ కాలేజీని హెరిటేజీ భవనంగా గుర్తించింది ఇటీవల రూ. 12 కోట్లతో లేజర్ షోలు, మ్యూజికల్ ఫౌంటేన్లు ఏర్పాటు చేసిన విషయం విదితమే. బర్త్‌డే కేక్ కటింగ్‌లతో ఏర్పడే చెత్త ఇతర వ్యర్థాలతో పర్యాటకులకు ఇబ్బందులు తలెత్తకుండా ఓయూ అధికారులు నిషేధం నిర్ణయాన్ని తీసుకున్నారు. రెండేళ్ల క్రితం ఆర్ట్స్ కాలేజీ ఎదుట సభలు, సమావేశాల నిర్వహణను నిషేధించిన విషయం విదితమే.

లుకేమియాకు నిమ్స్‌లో నాణ్యమైన వైద్యం: డైరెక్టర్ బీరప్ప

లక్డీకాపూల్: తొలి దశలోనే లుకేమియా వ్యాధిని గుర్తిస్తే మందులతో నయం చేయొచ్చని నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప అన్నారు. ఆస్పత్రిలో లుకేమియా వ్యాధిగ్రస్తులకు నాణ్యమైన వై ద్యం అందిస్తున్నామన్నారు. శుక్రవారం క్రానిక్ మైలాడ్ లుకేమియా (సీఎంఎల్) దినోత్సవం సందర్భంగా లెర్నింగ్ సెంటర్ లో నిర్వహించిన కా ర్యక్రమంలో ఆయన మాట్లాడారు. గతంలో ఈ వ్యాధి వస్తే జీవితం ముగిసిపోయిందని ఆందో ళన చెందేవారని, ఇప్పుడు ఆందోళన అవసరం లేదన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాంకేతికతతో సరైన సమయంలో వైద్యం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం సొంతం చేసుకోవచ్చన్నారు. బోన్‌మారో లాంటి చికిత్సలతో వ్యాధిని నియంత్రించే వెసులుబాటు ఉందన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ముషీరాబాద్: ఆమ్‌ఆద్మీ సామాన్యుల పార్టీ అని ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అన్నారు. ఈనెల 24 ఆదివారం నాడు బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కల్యాణమండపంలో సామాన్యుడి సమరభేరి సదస్సును నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సమరభేరి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా ఢిల్లీ ఎమ్మెల్యే సోమనాథ్‌భారతి హాజరవుతారని పేర్కొన్నారు. ఈ సదస్సుకు 33జిల్లాల నుంచి కన్వీనర్లు, పార్టీ నేతలు పాల్గొంటారు. రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్రా రాముగౌడ్, ఎం.డీ మజిద్, డాక్టర్ పుట్టా పాండురంగయ్య, ఆప్ మహిళా విభాగం అధ్యక్షురాలు హేమా జిల్లోజు తదితరులున్నారు.



ఆవిష్కరిస్తున్న డాక్టర్ దిడ్డి సుధాకర్ తదితరులు

సన్మానం



లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులుగా నియమితులైన లక్ష్మీనారాయణను బాగ్‌లింగంపల్లిలోని ఆయన నివాసంలో వాకర్స్ క్లబ్ హైదరాబాద్ సెంట్రల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఆయన గతంలో రామగుండం మేయర్‌గా పని చేశారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ.. తమ సంఘం చేసిన పోరాటం వల్లే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి చైర్మన్, కమిటీ సభ్యులను నియమించారన్నారు. రమేష్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, ఎండీ రఫీక్, వేణు, నర్సింహ్మ, సంపత్ తదితరులున్నారు.

బీసీ మహిళలపై వివక్ష సరికాదు



మాట్లాడుతున్న ఎర్ర సత్యనారాయణ

ముషీరాబాద్: 40 కోట్ల జనాభా ఉన్న బీసీ మహిళలపై కేంద్ర ప్రభుత్వం, దేశంలోని అన్ని రాజకీయ పార్టీలకు వివక్ష సరికాదని బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ అన్నారు. శుక్రవారం విద్యానగర్‌లోని బీసీభవన్‌లో 'బీసీ కోటా లేకుండా మహిళా బిల్లు' అనే అంశంపై ఆయన మాట్లాడారు. ఈనెల 25న బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో అన్ని బీసీకులాలు, సంఘాలతో సమావేశం నిర్వహించి ఉద్యమ కార్యచరణ ప్రకటిస్తామన్నారు. 56 శాతం ఉన్న బీసీలకు 73 ఏళ్ల క్రితం నాటి రాజ్యాంగ రిజర్వేషన్లు కోరుతూ.. డిమాండ్లు, ఉద్యమాలు చేసిన ఫలితం శూన్యమన్నారు. శ్రీనివాస్‌యాదవ్, పి.సుధాకర్, సుధాకర్‌ముదిరాజ్, స్వామిగౌడ్, శ్రీహరి, లక్ష్మణ్ తదితరులున్నారు.

అంబర్‌పేట ఫ్లైఓవర్ పనుల పరిశీలన



ఛే నంబర్ చౌరస్తాలో ఫ్లైఓర్ పనులును పరిశీలిస్తున్న గౌతమ్‌రావు

అంబర్‌పేట: అంబర్‌పేట ఫ్లైఓవర్ నిర్మాణంలో జరుగుతున్న జాప్యాన్ని నివారించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమవుతుందని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు గౌతమ్‌రావు మండిపడ్డారు. శుక్రవారం అంబర్‌పేట ఛే నంబర్ చౌరస్తాలో జరుగుతున్న ఫ్లైఓర్ పనులను పార్టీ శ్రేణులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఫ్లైఓర్ పనులను పూర్తి చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. పరిసర ప్రాంతల ప్రజలు, వాహనదారులు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పనులు సకాలంలో పూర్తి చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్పొరేటర్లు ఉమా రమేష్‌యాదవ్, అమృత, బీజేపీ నాయకులు శ్యామ్ రాజ్, నాగభూషణంచారి, రవీందర్‌గౌడ్, రమేష్‌యాదవ్, ఆనంద్‌గౌడ్ తదితరులున్నారు.

ఫీవర్ ఆసుపత్రిలోని గణనాథుడి లడ్డూ వేలం



ప్రసాదం అందజేస్తున్న టీఎంహెచ్ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాలిగామ అశోక్

నల్లకుంట: ఐదురోజుల పాటు భక్తులచే విశేష పూజలందుకున్న నల్లకుంట ఫీవర్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన గణనాథుడి లడ్డూ ప్రసాదం వేళం శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఆసుపత్రి సీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ జయలక్ష్మి సమక్షంలో పోటాపోటీగా సాగిన ఈ వేళం పాటలో వైరాలజీ ల్యాబ్ ఉద్యోగి, ఆసుపత్రి సూపరింటెండెంట్ అటెండర్ ఎం.అనిల్ రూ. 50,200లకు లడ్డూ ప్రసాదం దక్కించుకున్నారు. ఈ సందర్భంగా టీఎంహెచ్ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాలిగామ అశోక్ తదితరులు అనిల్‌ను శాలువాతో సన్మానించి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. ఆసుపత్రి వైద్యులు, ఫార్మసీ సిబ్బంది లావణ్య, పద్మజ తదితరులున్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి మురళీ ప్రసాద్ కృషి



జ్ఞాపికను అందజేస్తున్న ఎమ్మెల్యే, చైర్మన్, ఈఓ

చిక్కడపల్లి: చిక్కడపల్లి వివేక్‌నగర్ ఆంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణం విజయవంతంగా చేయడంలో మురళీప్రసాద్ ఎంతో కృషి చేశారని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. ఆలయ దివంగత చైర్మన్ మురళీప్రసాద్ సంస్మరణ సభ శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా మురళీప్రసాద్ కూమార్తె ప్రవీణ, కుమారుడు రఘునాథ ప్రదీప్ కటుంబసభ్యులకు జ్ఞాపికను ఎమ్మెల్యే అందజేశారు. గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్, ఆలయ చైర్మన్ బాసాని పద్మసూర్యప్రకాష్, ఈఓ మాచర్ల దేవనాథం, ధర్మకర్తలు జీకే రమణ, గణేష్, డాక్టర్ రామకృష్ణ, మాజీ చైర్మన్‌లు, ధర్మకర్తలు పాల్గొని మురళీప్రసాద్ సేవలను కొనియాడారు.

బీఆర్‌ఎస్ అందరికీ సముచిత స్థానం

అంబర్‌పేట: బీఆర్‌ఎస్ పార్టీలో పనితీరు ఆధారంగా నాయకులు, కార్యకర్తలకు సముచిత గౌరవం ఉంటుందని మంత్రి కేటీఆర్ చెప్పినట్లు కార్పొరేటర్ కె.పద్మావతిరెడ్డి తెలిపారు. బాగ్ అంబర్‌పేట డివిజన్ బీజేపీ కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి దంపతులు బీఆర్‌ఎస్ పార్టీలో శుక్రవారం చేరి మంత్రి కేటీఆర్‌ను ప్రత్యేకంగా కలిశారు. పార్టీ అవసరాన్ని బట్టి బాధ్యతల అప్పగిస్తుందని కేటీఆర్ తమతో చెప్పినట్లు ఆమె వివరించారు. పార్టీలోకి ఇతర పార్టీల నుంచి ఎవరు వచ్చిన సమన్వయంతో బలోపేతానికి పాటుపడాలన్నారు. పార్టీ సీనియర్ నాయకులు కె.దుర్గాప్రసాద్‌రెడ్డి తదితరులున్నారు.

సిద్ధి వినాయక.. బుద్ధి వినాయక

అంబర్‌పేట/ముషీరాబాద్ జోన్ పరిధిలో గణనాథుడికి విశేష పూజలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం స్వామివారికి వివిధ పత్రపూజలను శాస్త్రోక్తంగా అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రజాప్రతినిధులు గణనాథుడిని దర్శించుకోగా.. మండపాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఆటపాటలతో చిన్నా, పెద్ద తేడా లేకుండా భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు.

–అంబర్‌పేట/ముషీరాబాద్ జోన్ బృందం



నింబోలిఅడ్డలో బీజేపీ నాయకురాలు కె.గీతామూర్తి



గాంధీనగర్‌లో మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ తదితరులు



నల్లకుంట స్ట్రీట్ నంబర్ 8లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



పాలమూరు బస్తీలో..



అంబర్‌పేట డివిజన్‌లో గణేష్ పూజల్లో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతంరావు



గణేష్ వేడుకల్లో కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్



దాయరమార్కెట్‌లో నగేష్‌ముదిరాజ్



కవాడిగూడలో..



చెప్పల్‌బజార్‌లో కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్